

29న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

కవిటి: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని కమలాయిపుట్టుగలో ఆగస్టు 29న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధి వినాయక పూజా కమిటీ ఆధ్వర్యాన నిర్వహించే ఈ క్విజ్ పోటీల్లో ప్రతి టీమ్‌కీ నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండాలన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి తుది పోటీలకు అనుమతిస్తారని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచీ రెండు టీమ్‌లకు మాత్రమే అవకాశమని స్పష్టం చేశారు. ఎటువంటి ప్రవేశ రుసుం లేని ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.4,444, ద్వితీయ బహుమతి రూ.3,333, తృతీయ బహుమతి రూ.2,222 పాటు మెమొంటెలు, కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని తెలిపారు. పో టీలో పాల్గొనే జట్లు 8501011233, 9704201015 నంబర్లకు ఫోన్‌చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

ఇంజినీరింగ్‌పై అనాసక్తి!

- రెండో విడత కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లు 597
- ప్లేస్‌మెంట్‌లు తగ్గడం ప్రవేశాలపై ప్రభావం
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు విద్యార్థుల ప్రాధాన్యం



ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు యువత ఆసక్తి చూపడం లేదు. ఉన్నత విద్యా మండలి రెండు విడతల ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ పూర్తి చేసింది. తుది విడత కౌన్సెలింగ్ తర్వాత జిల్లాలో 597 సీట్లు మిగిలి పోయాయి. ఇంజినీరింగ్ విద్యార్హత కంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ప్లేస్‌మెంట్‌లు తగ్గడం కూడా ప్రవేశాలపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వ కళాశాలలో మొత్తం కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తారు. ప్రైవేట్ కళాశాలలో 70 శాతం కన్వీనర్ కోటా, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు నిర్వహిస్తారు. కన్వీనర్ కోటాలో సీట్లు మిగిలిపోవడంతో, ఇక మేనేజ్‌మెంట్ కోటా సీట్ల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో కళాశాలల నిర్వహణ భారంగా మారే అవకాముందని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం సీట్లు 2,418 ఉండగా మొదటి విడత కౌన్సెలింగ్‌లో 1836, తుది విడతలో 1821 ప్రవేశాలు జరిగాయి. ఇంకా 597 సీట్లు మిగిలి పోయాయి.

కొన్నేళ్ల కిందట వరకు ఇంజినీరింగ్ విద్యకు ఎంతో డిమాండ్ ఉండేది. లక్షలు ఖర్చు చేసి ఇంజినీరింగ్ చదివించే వారు. డిమాండ్ నేపథ్యంలో అప్పట్లో ఉమ్మడి జిల్లాలో అనేక ఇంజినీరింగ్ కళాశాలలను రూ.కోట్ల ఖర్చుతో ప్రారంభించారు. క్రమేణా ప్రవేశాలు తగ్గి నిర్వహణా భారం పెరగడంతో శ్రీకాకుళం రూరల్, పలాస, నందిగాం, ఎచ్చెర్ల మండలాల పరిధిలోని ఐదు కళాశాలలు మూతపడ్డాయి. కనీసం 700 సీట్లు ఉన్న కళాశాలల్లో సీట్లు తగ్గించుకున్నా, ప్రవేశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలలు జాతీయ సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ) నిబంధనల మేరకు ప్రమాణాలు పాటించాలి. అర్హత గల అధ్యాపకులు, ల్యాబ్‌లు, సౌకర్యాలు ఉండాలి. ఇందుకు రూ.కోట్లలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. కళాశాలకు పూర్తిస్థాయిలో ప్రవేశాలు జరగకపోతే నిర్వహణ కష్టంగా మారుతుంది.

జిల్లాలో ఇంజినీరింగ్ కాలేజీలు : 4
మొత్తం సీట్లు : 2,418
నిండిన సీట్లు : 1821
మిగులు సీట్లు : 597

కళాశాల	సీట్లు	ప్రవేశాలు
బిఆర్‌ఎయు	330	208
ఐతమ్	1200	1164
శివానీ	384	309
వెంకటేశ్వర	504	140

అగమ్యగోచరంగా మేనేజ్‌మెంట్ సీట్లు

ఫీజు స్ట్రక్చర్ రూ.45 వేలు ఉంటే మేనేజ్‌మెంట్ కేటగిరీలో రూ.లక్ష ఫీజు ఉంటుంది. అటువంటిది కామన్ ఫీజుకే కళాశాలలు సీటు ఇచ్చే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని కళాశాలల్లో సిఎస్‌ఇ, ఇసిఇ, సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఇ వంటి బ్రాంచ్‌లు ఉన్నాయి. కొత్తగా ఎఐ, మిషన్ లెర్నింగ్ వంటి బ్రాంచ్‌లు కొన్ని కళాశాలలు ప్రారంభించాయి. మరోవైపు మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు ప్రముఖ కళాశాలల్లో, మరోవైపు సిఎస్‌ఇ, ఇసిఇ వంటి బ్రాంచ్‌ల్లో మాత్రమే నిండుతున్నాయి.

ఇంజినీరింగ్‌పై ఆసక్తి తగ్గిందా...

జిల్లా నుంచి ఎపి ఇఎపిసెట్ ఎంపిసి స్ట్రీమ్‌కు 9,434 మంది దరఖాస్తు చేసుకున్నారు. 9,062 మంది పరీక్ష రాశారు. సెట్‌లో 6,402 మంది అర్హత సాధించారు. 1821 మంది మాత్రమే జిల్లా కళాశాల్లో చేరారు. జిల్లా విద్యార్థులు సైతం ప్రముఖ పట్టణ ప్రాంతాల్లో కళాశాలలు, ప్రముఖ విశ్వవిద్యాలయాలకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రతిభ గల విద్యార్థులు జెఇఇ పరీక్ష రాసి జాతీయ విద్యాసంస్థలు ఐఐటి, ఎన్‌ఐటి, ట్రిపుల్ ఐటి వంటి సంస్థల్లో చేరారు. దీంతో జిల్లా కళాశాలల్లో ప్రవేశాలు తగ్గాయి. జిల్లాలకు సంబంధించిన ఒక్క కళాశాలలో మాత్రమే మెరుగ్గా ప్రవేశాలు ఉన్నాయి. ఈ కళాశాలలో సైతం మేనేజ్‌మెంట్ సీట్లకు ఆశించిన డిమాండ్ లేదు. ఇంటర్మీడియట్ తర్వాత డిగ్రీ వంటి కోర్సులకు సైతం ప్రాధాన్యతనిస్తున్నారు. పక్క రాష్ట్రాల్లోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు సైతం ప్రాధాన్యతనిస్తున్నారు.

విద్యా ప్రమాణాలపై దృష్టిసారించాలి



చాలా మంది విద్యార్థులు పక్క రాష్ట్రాల ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. డిగ్రీల కోసం కంటే నైపుణ్యాలు, ఉపాధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్లేస్‌మెంట్‌లు తగ్గడం వంటివి సైతం ప్రవేశాలపై ప్రభావం చూపుతున్నాయి. విద్యా ప్రమాణాలపై విద్యాసంస్థలు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**ప్రొఫెసర్ కూన రామ్‌జీ,
శ్రీ కృష్ణా విశ్వవిద్యాలయం, వైస్‌ఛాన్సలర్,
మచిలీపట్నం**

కొన్ని బ్రాంచ్‌ల్లో ప్రవేశాలు మెరుగ్గా ఉన్నాయి



ప్రస్తుతం ట్రెండ్‌లో ఉన్న సిఎస్‌సి, ఇసిఇ, ఎఐ, ఐటి వంటి బ్రాంచ్‌లకు విద్యార్థులు ప్రాధాన్యత ఇస్తున్నారు. సివిల్, ట్రిపుల్‌ఇ, మెకానికల్ వంటి బ్రాంచ్‌ల్లో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటివి విద్యార్థులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. భవిష్యత్‌లో ఇంజినీరింగ్‌కు డిమాండ్ పెరగవచ్చు.

**- డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు,
ప్రిన్సిపాల్,
బిఆర్‌ఎయు ఇంజినీరింగ్ కాలేజ్**



మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

14న అంగన్వాడీ యూనియన్ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సెప్టెంబరు 14న పాతపట్నంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సుధ, కె.కళ్యాణి తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సమావేశాన్ని నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్.ఆర్.ఎస్ రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి, మన రాష్ట్రంలో 2019 నుంచి అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. ఈ కాలంలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పనిభారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవటం లేదన్నారు. అంగన్వాడీలకు డిఎ, పివిఆర్‌సి అమలు చేయడం లేదని విమర్శించారు. సంక్షేమ పథకాలు కూడా అమలు చేయడం లేదన్నారు. అంగన్వాడీ సెంటరు నిర్వహణకు ఇచ్చిన ఫోన్‌లు పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్ అమలుకు సపోర్ట్ చేయడం లేదని చెప్పారు. లబ్ధిదారులకు ఫొటో క్యాప్చర్, ఒటిపి, ఎఫ్.ఆర్.ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎఫ్.ఆర్.ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, ఆన్‌లైన్ వర్క్‌కు ఒక యాప్ మాత్రమే ఉండాలని, సెంటరు నిర్వహణకు నాణ్యమైన ట్యాబ్‌లు ఇవ్వాలని, 5జి నెట్ ఇవ్వాలని కోరారు. ప్రధానమంత్రి మాతృ వందనం పథకాన్ని కొత్తగా అంగన్వాడీలు అప్పగించరాదని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. గ్రాట్యుటీ జిఒలో మార్పులు చేయాలని, హెల్పర్ల ఉద్యోగోన్నతులకు విధివిధానాలు రూపొందించాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, యూనియన్ నాయకులు పి.లతాదేవి, బి.శాంతామణి, కె.వి.హేమలత, బి.సునీత, పొన్నాడ.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 30న తపాల పత్రాల రచన పోటీలు

శ్రీకాకుళం: విద్యార్థుల్లో తపాలా సేవలపై అవగాహన పెంపొందించేందుకు తపాలాశాఖ 2017 నుంచి ఏటా తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని పోస్టల్ శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 9న ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా తపాలా పత్రాల రచన పోటీలను సెప్టెంబరు 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 16వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి విభాగంలో స్కూల్ విద్యార్థులు (6, 7, 8, 9వ తరగతులు) తపాలా పత్రం రచన (లెవల్-1, 2) ఉంటాయని తెలిపారు. రెండో విభాగంలో స్కూల్ స్థాయి పోటీలు ఉంటాయని, పేర్కొన్నారు. విజేతలను జిల్లాస్థాయి పోటీలకి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో మొదటి బహుమతి రూ.500, రాష్ట్రస్థాయిలో రూ.ఆరు వేలు ఉంటుందని, 25 ఉత్తమ ఎంట్రీలు ప్రత్యేక బహుమతులకు అర్హులని తెలిపారు. విద్యార్థులు తపాలా సేవల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పాఠశాలల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.

'ఆశా'లకు కనీస వేతనం అమలు చేయాలి

ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నాగమణి



మాట్లాడుతున్న నాగమణి

ప్రజాశక్తి- పలాస

ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నాగమణి డిమాండ్ చేశారు. స్థానిక అక్షర కాలేజీలో ఆశా యూనియన్ పలాస, వజ్రపుకొత్తూరు మండల మహాసభ సిఐటియు ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఆశా కార్యకర్తలు చాలీచాలని వేతనలతో వెట్టిచారికీ చేస్తున్నారని అన్నారు. అలాగే ఆశాలకు సంబంధం లేని పనులు అప్పగించి చేయమని చెప్పడం సమంజసం కాదన్నారు. గ్రాడ్యూటీ కూడా పెంచాలని డిమాండ్ చేశారు. సెలవులు ఇవ్వాలన్నారు. ఆశాల సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పలాస మండలం అధ్యక్షునిగా వై.హేమలత, కార్యదర్శిగా జి.జ్యోతి, కమిటీ సభ్యులుగా సబితా పాత్రో, ఎం.లావణ్య, రేవతి, ఎస్.శ్రీలత, బి.కృష్ణవేణితో పాటు 15 మందితోను, వజ్రపుకొత్తూరు మండలం అధ్యక్షునిగా బి.లక్ష్మి, కార్యదర్శిగా ఎస్.రమణమ్మ, కమిటీ సభ్యులుగా ధనలక్ష్మి, జి.ధనలక్ష్మి, జి.లక్ష్మితో పాటు 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ద్రౌపది, లక్ష్మి, సరస్వతి, పార్వతి పాల్గొన్నారు.

యూరియా ఇవ్వండయ్యా..!

- అధికారుల పొంతన లేని మాటలు
- యూరియా కోసం రైతులు పడిగాపులు



ప్రజాశక్తి- బూర్జ

అన్నదాతకు యూరియా కష్టాలు తప్పడం లేదు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు సాగునీరు అందక తీవ్ర అవస్థలకు గురవుతున్న తాము చివరకు ఎరువుల కోసం కూడా తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులను సకాలంలో అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఎరువులు సక్రమంగా పంపిణీ విషయంలో శ్రద్ధ కనపరచడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలో సుమారు 1800 యూరియా బస్తాలు వచ్చినప్పటికీ రాజకీయ నాయకుల సిఫార్స్‌ల మేరకు ఇతర జిల్లాలకు తరలిపోయాయని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నా కేవలం ఒక్క యూరియా బస్తా అందజేస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. చివరకు ఆ ఒక్క బస్తా కూడా ఇవ్వని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని రైతుల విమర్శిస్తున్నారు.

అధిక ధరలకు కొనాల్సిందే....

ప్రభుత్వం నుంచి యూరియా అందకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నామని, ఎరువులను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నామని వాపోతున్నారు. రైతులకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధం లేకుండా పోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నానో యూరియాను రైతుల నెత్తిన రుద్దే ప్రయత్నం చేస్తున్నారని వాపోతున్నారు. శనివారం మండల కేంద్రంలో యూరియా విక్రయాలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ విక్రయాలను సోమవారానికి వాయిదా వేశారని రైతులు చెబుతున్నారు. రైతులకు అవసరమైన యూరియాను అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించకపోతే ఆందోళన చేపడతామని రైతులు స్పష్టం చేస్తున్నారు.

అవసరాలను గుర్తించాలి

వ్యవసాయం ప్రస్తుత కాలంలో చాలా కష్టతరంగా మారుతుంది. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని రైతులు విమర్శిస్తున్నాయి. రైతుల జీవితాలతో ఆటలు ఆడొద్దని రైతులు హెచ్చరిస్తున్నారు. రైతులకు అవసరమైన కనీస అవసరాలను గుర్తించి అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

పదెకరాలున్నా ఒక బస్తాయే



పదెకరాలు ఉన్నా, ఎకరా ఉన్నా ఒక బస్తా మాత్రమే యూరియాను అంద జేస్తున్నారు. బయట మార్కెట్‌లో నానో యూరియాను అంటగడు తున్నారు. డిఎపి లేకపోతే గుళికలను, పురుగు మందులు కొనాల్సిందేనని చెబు తున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో యూరియాను అందజేయాలి.

- గొల్వి ఆదినారాయణ, వావాం

యూరియాను అందజేయాలి



యూరియా లేక పంటలు నష్ట పోయిన పరిస్థితి ఉంది. ప్రభుత్వంతో పాటు అధికారులు అవసరమైన యూరి యా అందించేందుకు చర్యలు చేపట్టాలి.

- కోతల రెయ్యమ్మ, వావాం

నేటి నుంచి రేషన్‌కార్డుల పంపిణీ

డిఎస్‌ఒ సూర్యప్రకాశరావు

ప్రజాశక్తి - లావేరు

జిల్లాలో 6,51,645 స్మార్ట్ రేషన్‌కార్డులను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాశరావు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ కార్డులను మండలాలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డిపోల్లో కార్డుదారులకు విఆర్‌ఒలు, డీలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేస్తారని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్డులు పంపిణీ చేయాలన్నారు. డీలర్లు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఆమదాలవలస నియోజకవర్గానికి 69,376, ఎచ్చెర్ల నియోజకవర్గానికి 93,430, శ్రీకాకుళం నియోజకవర్గానికి 81,113, పాతపట్నం నియోజకవర్గానికి 79,771, ఇచ్ఛాపురం నియోజకవర్గానికి 90,186 వచ్చాయని చెప్పారు. పలాస నియోజకవర్గానికి 74,862, టెక్కలి నియోజకవర్గానికి 84,704, నరసన్నపేట నియోజకవర్గానికి 78,704 వచ్చాయని, జిల్లావ్యాప్తంగా 6,51,645 స్మార్ట్ రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.ఎల్.ఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రేషన్‌కార్డుల కేటాయింపును పర్యవేక్షిస్తున్న డిఎస్‌ఒ సూర్యప్రకాశరావు

శారీరక దృఢత్వంతోనే సంపూర్ణ ఆరోగ్యం



జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న శంకర్‌ప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శారీరక దృఢత్వంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎఆర్ డిఎస్‌పి శేషాద్రి అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ కార్యాలయంలో సాయుధ బలగాల పోలీస్ సిబ్బంది సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ఎఆర్ ఆర్‌ఐ శంకర్ ప్రసాద్ జెండా ఊపి సైకిల్ ర్యాలీని ఆదివారం ప్రారంభించారు. ముందుగా యోగా కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఒక గంట పాటు వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి ఆదివారం పోలీసులు సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఒత్తిడి ఉపశమనానికి వ్యాయామాలు ఎంతగా దోహదపడతాయని చెప్పారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత ఉత్సాహంగా సేవలు అందించగలమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు కె.నర్సింగరావు, శంకర్ ప్రసాద్, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యపై ప్రత్యేక దృష్టి

- సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన వసతి, భోజన సౌకర్యం
- 6,900 మంది విద్యార్థులు విద్యాభ్యాసం
- జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ





ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ అన్నారు. జిల్లాలో 81 వసతిగృలు ఉన్నాయని అన్నారు. అందులో 6,900 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పన, విద్యా ప్రగతికి స్టడీ అవర్స్ నిర్వహణ, ట్యూటర్ల నియామకం వంటి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు అంశాలను వెల్లడించారు.

? సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ ఎలా ఉంది?

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వసతిగృహాలు నిర్వహిస్తున్నాం. పక్కాగా మెనూ అమలు చేస్తున్నాం. పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేవిధంగా నిర్వహణ ఉంది. నిరంతరం వసతిగృహాలను పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నాం.

? వసతిగృహాల్లో ప్రవేశాలు ఎలా ఉన్నాయి?

జిల్లాలో 81 వసతిగృహాలు ఉన్నాయి. 78 ప్రస్తుత గృహాల్లో 6,900 మంది విద్యార్థులు ఉన్నారు. మూడు వసతిగృహాలు జీరో అడ్మిషన్లతో సాగుతున్నాయి. 60 ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో 4,500, 18 పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో 2,400 మంది విద్యార్థులు ఉన్నారు.

? ఎటువంటి మెనూ అమలు చేస్తున్నారు?

వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పాఠశాలలో చేస్తున్నారు. ఉదయం, రాత్రి భోజనం పెడుతున్నాం. పక్కాగా మెనూ అమలు చేస్తున్నాం. ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా విద్యార్థుల హాజరు నమోదు చేసి భోజనం పెడుతున్నాం. విద్యార్థుల సంఖ్య ఆధారంగా బిల్లులు చెల్లింపు ఉంటుంది. వారానికి మూడు రోజులు ఆది, మంగళ, శుక్రవారాల్లో చికెన్ పెడుతున్నాం. వారానికి ఆరు రోజులు కోడిగుడ్లు పెడుతున్నాం. జోడి అంబలి, వేరుశెనగ చిక్కీలు వంటివి అందజేస్తున్నాం. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ప్రభుత్వం మెనూ అమలు చేస్తుంది.

? కొత్త భవనాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారా?

జిల్లాలో 25 వసతిగృహాలు మాత్రమే ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్నాయి. 56 సొంత భవనాలు ఉన్నాయి. స్థలాలు ఉన్నచోట భవన నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రూ.1.17 కోట్లతో 23 గృహాల్లో మరమ్మతులు నిర్వహించాం. భవనాల పరిస్థితి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం.

? విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయి?

ఈ ఏడాది 80 శాతం ఫలితాలు పదో తరగతిలో వచ్చాయి. తప్పిన వారికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి సప్లమెంటరీ రాయించాం. మొత్తం 95 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ విద్యా సంవత్సరంలో ఇంకా మెరుగైన ఫలితాలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. స్టడీ అవర్స్ నిర్వహణ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, హిందీ సబ్జెక్టులకు ట్యూటర్ల నియామకం వంటి వాటిపై దృష్టిపెట్టాం. విద్యార్థులకు సబ్జెక్టు నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నాం.

? విద్యార్థుల ఆరోగ్యానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం కోసం తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న. తాగునీటి పరీక్షలు నిర్వహించి సురక్షితం అని తేలేక నీటిని అందజేస్తున్నాయి. వంట గదిలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. తల్లిదండ్రుల సమావేశ నిర్వహణ, ఫ్రైడే డ్రైడే, క్లీన్ అండ్ గ్రీన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

సవరణ

నిన్న ప్రచురణ అయినా **శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ టెండర్ నోటీసులో** మున్సిపల్ ఆఫీస్ కి ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ నందలి క్రమ సంఖ్య 10లో **షాప్ నెంబరు 19(S.C)=1 షాపు.** అని చదవగలరు.



బస్టాండ్ వద్ద బస్సుల కోసం చూస్తున్న మహిళా ప్రయాణికులు

బస్సుల కోసం పడిగాపులు

ప్రజాశక్తి- రణస్థలం

మహిళలకు ఉచిత బస్సు అని కూటమి నాయకులు ఊదరగొడుతున్నారు. తీరా బస్టాండ్‌కి వెళితే ఫ్రీ బస్సు దేవుడెరుగు.. అసలు బస్సులే కరువయ్యాయి. ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా రోడ్డుపై గంటల కొద్దీ పడిగాపులు పడాల్సిన పరిస్థితి. రణస్థలం - విశాఖపట్నం వెళ్లే ప్రయాణికుల అవస్థలు చెప్పనవసరం లేదు. రణస్థలం, లావేరు మండలాల్లో ఉన్న చాలా మంది విద్యార్థులు విశాఖపట్నం ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో చదువుతున్నారు. అయితే ప్రతి ఆదివారం పిల్లలను చూడడానికి భార్య, భర్తలు ద్విచక్ర వాహనం మీద వెళ్లి పిల్లలను చూసుకుని వచ్చేవారు. ఫ్రీబస్సులు పుణ్యమా అని భర్తలు మరి వెళ్లడం లేదు. మహిళలే పిల్లలను చూడడానికి విశాఖపట్నం బయలుదేరడంతో బస్సులు మహిళలతో కిక్కిరిసిపోతున్నాయి. అనుకున్నన్ని బస్సులు లేకపోవడంతో మహిళా ప్రయాణికులు రోడ్డుపై పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు అదివారం రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డే అండ్ నైట్, సెవెన్ రోడ్డు జంక్షన్‌లో వాహనదారులకు రోడ్డుభద్రతపై పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలపై పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజు ఎంతోమంది వాహనదారులు రోడ్డు నియమాలను సరైన విధంగా పాటించకపోవడం వలన ప్రమాదాలకు గురవుతున్నారని, చాలామంది ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్ మోహనరావు పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సేవాసమితి ప్రతినిధులు

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీ సత్యసాయి సేవాసమితి మెట్టక్కి వలస ఆధ్వర్యంలో పాత ఆమదాలవలస సత్యసాయి మందిరం ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానులు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పి.తాతయ్యలు, డాక్టర్ కె.హేమంత్, డాక్టర్ ఎ.వి.పద్మజ, డాక్టర్ డి.సురేష్, డాక్టర్ పప్పల సౌజన్య రోగులకు సేవలందించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జి బోయిన నరసింహమూర్తి, రవీంద్రబాబు, మూర్తి, రామమోహన్, కొమనాపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి వార్డు కమిటీల ఎన్నిక

పలాస: వైసిపి బలోపేతానికి ప్రతిఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టి గోపి అన్నారు. పలాస 19 వార్డుల్లో వైసిపి వార్డు కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా వార్డు పార్టీ కమిటీలు పనిచేయాలన్నారు. వైసిపి నాయకులు బగాది సింహాచలం, కామేశ్వరరావు, సీపాన లోకేష్, పిట్టా భాస్కరరావు, దీర్ఘాసి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

పలాస: కార్మికుల హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలని కార్మికశాఖ అధికారి విజయకుమార్ అన్నారు. స్థానిక ఎన్‌జిఒ, లేబర్, పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడైనా బాల కార్మికులు, పనికితగ్గ వేతనం అందుకోని కార్మికులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అందుకు అన్నీ శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కె.ఆనందరావు, ఎన్‌జిఒ సిబ్బంది జి.చైతన్య, కె.లక్ష్మణరావు, డి.గోపయ్య పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కె.గున్నయ్య మెళియాపుట్టి, వి.కుమారి టెక్కలి బదిలీపై వెళ్లారు. వీరికి ఆదివారం గ్రామస్తులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ మేరకు వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు పోలాకి ఢిలేశ్వరరావు, ఎంపిటిసి సైలాడ లావణ్య, ఉపాధ్యాయులు వనిత, బి.శంకరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కోటబొమ్మాళి: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లు ప్రజలతో మమేకమై అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం నాలా టాక్స్ రద్దు చేయటం హర్షణీయమన్నారు. దీంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నారు. టిడిపి నాయకులు కర్రి అప్పారావు, సాసుమహంతి ఆనందరావు, కోరాడ పెద్ద గోవిందరావు, చిన్న గోవింద పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ బి.శంకర్ అన్నారు. నరసన్నపేట కేంద్రంలో శ్రీరాంనగర్‌లో సిసి రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.3 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కెసిహెచ్ గుప్తా, సింహాచలం, రామ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్డుల పంపిణీ

నరసన్నపేట: స్మార్ట్ రేషన్ కార్డులు సోమవారం పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం తహశీల్దార్ కార్యాలానికి చేరిన స్మార్ట్ రేషన్ కార్డులను పరిశీలించారు. లబ్ధిదారులకు ఉచితంగా ఈ కార్డులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జలుమూరు మండలంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చేతులు మీదుగా ప్రారంభిస్తున్నామని అన్నారు.

హామీల అమల్లో విఫలం

కొత్తూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలులో విఫలమైందని వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్టూరు బిట్ 1,2 గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మనుమ లక్ష్మీనారాయణ, సర్పంచ్ ప్రతినిధి నక్క వెంకటరావు, ఎంపిపి ప్రతినిధి సవర రమేష్ మురుపాక శంకరరావు, సవర సింహాద్రి, సర్పంచ్ ప్రతినిధి వైకుంఠరావు పాల్గొన్నారు.

వివాదాల సుడిలో శ్మశాన భూమి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కంబిరిగాం భూ వివాదం ఇంకా ఒక కొలిక్కి రాకముందే ఆ ప్రాంతంలో మరో వివాదం శ్మశానం రూపంలో ప్రజలకు విస్మయానికి గురిచేస్తుంది. ఆక్రమార్కులు శ్మశానాలను సైతం కబ్జాకు పాల్పడుతున్నారు. శ్మశానంలో ఉన్న సమాధులను పూర్తిగా తొలగించి ఆ ప్రాంతంలో భారీ నిర్మాణాలకు పలాసకు చెందిన ఓ వ్యాపారి కంకణం కట్టడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ భూములు శ్మశానాలకు చెందినవి అంటూ గ్రామస్తులు జూన్ 23న కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా పనులు మాత్రం నిలుపుదల కాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబరు 33/1లో 23 సెంట్ల స్థలాన్ని కంబిరిగాంకి చెందిన చౌదరి కుటుంబం తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం శ్మశానానికి ఆ స్థలాన్ని కేటాయించారు. అక్కడే వారి తాతతండ్రుల సమాధులు కూడా కట్టుకున్నారు. ఓ వ్యాపారి కూల్చివేశారు. సర్పంచ్ బి.ధనుంజయ్, శివకుమార్‌తో పాటు గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఆ



చదును చేస్తున్న జెసిబి

పనులు అక్కడితో నిలిచిపోయాయి. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో చౌదిరి కుటుంబీకులు ఆ భూమిలో తమకు చెందిన శ్మశానం అంటూ బోర్డు కూడా పెట్టారు. ఆ వివాదం అక్కడితో ముగిసింది. ఏమి జరిగిందో తెలియదుగాని.. రెండు రోజుల నుంచి శ్మశానం ప్రాంతంలో మళ్లీ చదును చేసే కార్యక్రమాలు ప్రారంభం కావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న లీల

ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని సాయి వినీత్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, విశ్రాంతి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.లీలా అన్నారు. మండలంలోని పూండిలో ఉన్న సాయి వినీత్ ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం వల్ల సమాజంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవచ్చని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తు న్నామని తెలిపారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా సమర్థ వంతమైన విద్యాబోధన చేపడుతున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ చాపర కోదండ రావు, ప్రిన్సిపాల్ అన్నెపు కైలసరావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిని శ్రీను, అధ్యాపకులు ధర్మారావు, సాయి, షణ్ముఖరావు, రమేష్ పాల్గొన్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు పడడంతో వరి సాగుకు సంబంధించి దమ్ము, గట్ల వేయడం, ఉబాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు దమ్ము ట్రాక్టర్లతో, కాడెద్దులతో పొలాలను దున్నుతుండగా, ఉబాలకు గతంలో వేసిన వరినారును సిద్ధం చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. మరి కొంతమంది అన్నదాతలు పొలం గట్లను చదును చేసే పనిలో బిజీగా ఉన్నారు. పొలాల్లో మహిళలు ఎంతో ఉత్సాహంగా వరినాట్లు వేసే పనిలో కనిపిస్తున్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం, హీరాపురం, నందవ, మర్రిపాడు-కె,



దమ్ము పడుతున్న రైతు

భరణికోట, కరజాడ, వెంకటాపురం, ఆంపురం, ఇళయపురం, గొడ్డ, ముకుందపురం, బాణాపురం తదితర గ్రామాల్లో సుమారు 1145 ఎకరాల్లో ఉబాలు అవుతున్నాయని ఎఒ ఎ.దానకర్ణుడు తెలిపారు.

మురపాక మండలం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- లావేరు

మురపాక మండల సాధన కొరకు మురపాక పరిసర ప్రాంతాల పంచాయతీ సర్పంచ్ లు, ఎంపిటిసిలు, యువకులు, వ్యాపారులు, కార్మికులు ఆదివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును కలిసి మురపాక మండలం ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురపాక మండల విషయంపై సిఎంతో చర్చించడం జరిగిందన్నారు. తప్పనిసరిగా మురపాక మండలం ఏర్పాటుపై పూర్తిస్థాయిలో ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పొందూరు మండలం లోలుగు కెజిబివి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సౌమ్య ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు నూక అప్పల సూరన్నాయుడు (నూక రాజు) అన్నారు. ఆదివారం కనుగులవలసలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ప్రజలు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసే హక్కు ఉంటుందని, ప్రిన్సిపాల్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా ఆయన జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో కలెక్టర్ ఆమెను బదిలీ చేశారన్నారు. నాయకులు బెండి రవికాంత్, బొడ్డేపల్లి ఆనందరావు, గురుగుబెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బిల్లులు ఇవ్వాలి

నరసన్నపేట: ప్రయివేటు ఎరువుల వ్యాపారులు రైతులకు విక్రయాలు చేసేటప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ప్రభుత్వం నిబంధనలు మేరకు విక్రయించాలని వ్యవసాయ శాఖ ఎడి ఎల్.వి.మధు సూచించారు. స్థానిక శ్రీనివాస్ ట్రేడర్స్, కోరమాండల్, రైతు డిపోలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ మేరకు నిల్వ ఉన్న స్టాక్, రికార్డులను పరిశీలించారు. విజిలెన్స్ సిఐ డి.వి.వి.సతీష్ కుమార్, సిహెచ్.ఎర్రంనాయుడు, ఎఒ సూర్యకుమారి పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి, సానారుద్రవరంలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహాలపై శుక్రవారం అర్ధరాత్రి దుశ్చర్యకు పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా వారిని శిక్షించాలని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర డిమాండ్ చేశారు మండల కేంద్రం లావేరు కూడలిలో ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహానికి లావేరు జెడ్‌పి పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ రంగా విగ్రహాలపై దుశ్చర్యకు పాల్పడిన వారిని తక్షణమే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, లంకలపల్లి శ్రీనువాసరావు, ఆనందరావు, లావేరు ఉపసర్పంచ్ పైడి దాము, ఎంపిటిసి యినపకుర్తి సతీష్, మాకన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కోచ్ బోర్డు పనులు ప్రారంభం

కవిటి: సోంపేట రైల్వే స్టేషన్‌లో డిజిటల్ కోచ్ బోర్డు కనెక్షన్ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. గత ఆరు నెలలుగా నిలిచిపోయిన పనులు జెడ్ ఆర్ యుసిసి మెంబర్ శ్రీనివాసరావు చొరవతో ఆదివారం పున్న ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రయాణికులు మాట్లాడుతూ డిజిటల్ కోచ్ బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణంలో సౌలభ్యం కలుగుతుందని హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు యోగా చేయాలి

లావేరు: విద్యార్థులు యోగా చేసినట్లయితే ఏకాగ్రత పెరుగుతుందని, ప్రతి విద్యార్థి విధిగా యోగా చేయాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం లావేరు శాఖాగ్రంథాలయ ఆవరణలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. . కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం సమకూరుతుందని హంబల్‌బి ప్రతినిధి ప్రభాకర్ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యాన హంబల్‌బి సౌజన్యంతో తేనెటీగల పెంపకంపై రైతులకు ఆదివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తేనె టీగలు మూడు రకాలు ఉంటాయని తెలిపారు. హంబల్‌బి కంపెనీకి రైతు రూ.82,525 చెల్లిస్తే తేనె టీగలతో పాటు 10 పెట్టెలు, 13 రకాల పరికరాలు అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం గొడబ ప్రసాదరావు ఎపిఎం ఈశ్వర్, ఎస్ఎఫ్‌టిఒ అధ్యక్షులు సుజాత, కోశాధికారి పద్మావతి, మండల సమాఖ్య అధ్యక్షులు సరస్వతి, కోశాధికారి



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న ప్రభాకర్

చంద్రకళ, అకౌంటెంట్ సౌజన్య, సిసిలు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక వెలుగు కార్యాలయంలో తేనె టీగల పెంపకంపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. హైదరబాద్‌కు చెందిన హంబుల్ బి.సమస్త ఆధ్వర్యాన మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభాకరరావు, ఈశ్వరరావు, ఎపిఎం మనోరత్నం, సిసిలు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు తామాడ లక్ష్మణరావు అన్నారు. ఇటీవల రహదారి ప్రమాదానికి గురైన గోపినాథపురానికి చెందిన దున్న హేమరావును ఆదివారం కలిసి రూ.పది వేలు ఆర్థికసాయం సంస్థ తరుపున అందించారు. గల్ఫ్‌లో వలస కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే హేమారావుకు ప్రమాదం సంభవించడంతో కుటుంబం వీధిన పడింది. ఈ విషయం తెలిసిన సంస్థ సభ్యులు స్పందించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చింత మోహన్, మండల మహేష్, గర్తం వెంకటేష్, చింత కిశోర్‌కుమార్, గుంటు భాస్కరరావు, దండుపాటి పవన్‌కుమార్, చింత రఘు, కృష్ణారావు, బాబూరావు, శంకర్, చందు, కొంకి మోహిని, బై.హిమావతి, రాణి, రజిని, చింత రోహిణి, దివ్య, తామాడ జీవిత, మీనాక్షి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలసలో ఇటీవల కూర్మాన ముసలయ్య, బుసకాల మల్లేశ్వరరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మృతుల కుటుంబ సభ్యుల రూ.5 వేలు చొప్పున సర్పంచ్ సార్లన బాలకృష్ణ చేతుల మీదుగా ఆర్థికసాయం అందించారు. అలాగే ప్రమాదంలో కాళ్లు విరిగిపోయిన విద్యార్థి పెద్ద సుదర్శన్ కుటుంబ ఇబ్బందులను తెలుసుకుని వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, చెస్ క్రీడను నిరంతరం సాధన చేయడం వలన మెదడు బాగా పని చేస్తుందని శ్రీ సాయిదుర్గా ట్యూషన్ సెంటర్ ప్రిన్సిపాల్ కె.ఉమారాణి అన్నారు. నగరంలోని ఇల్లీసిపురంలో గల తిలక్‌నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సూర శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ ఉత్సాహంగా జరిగింది. రౌండ్ల పాటు జరిగన ఈ పోటీల్లో చెస్ క్రీడాకారులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధావుల క్రీడ అని అలాంటి క్రీడలో జిల్లా చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని చెస్‌ను నేర్చుకోవడం, పోటీల్లో రాణిస్తుండడం, స్కూల్ ఆఫ్



క్రీడాకారులతో ప్రిన్సిపాల్ ఉమారాణి

చెస్ అకాడమీ సంస్థ గడిచిన 16 ఏళ్లుగా జిల్లాలో 204 చెస్ టోర్నీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఆమె విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ చెస్ కోచ్‌లు, ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ ప్లేయర్లు భేరి చిన్నారావు, కె.సాయి నిరంజన్ సింగ్, సీనియర్ చెస్ క్రీడాకారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



టెక్కలి రూరల్ : మట్టి విగ్రహాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

మట్టి విగ్రహాలను పూజిద్దాం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలిలోని ఆయన నివాసం వద్ద ఆదివారం ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయకచవితికి ప్లాస్టో పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అన్నారు. దివ్వెల మాధురి మాట్లాడుతూ దువ్వాడ శ్రీనివాస్ ఛారిటబుల్ ట్రస్టు ప్రారంభించామని, దీని ద్వారా పేదలకు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూన సూర్యం, పేడాడ రమేష్, కవిటి రామరాజు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పర్యావరణ పరిరక్షణకు మనమంతా మట్టి గణపతిని పూజిద్దామని స్థానిక గాంధీ ఆస్పత్రి వైద్యులు, రుచి హెల్త్ ట్రిక్స్ సంస్థ అధినేత హెచ్.సతీష్ అన్నారు. ఈ సందన్భంగా సంస్థ ద్వారా ఉచితంగా 18 వేలు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

పొందూరు: పొందూరు తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోలా ఉమా లక్ష్మణరావు దంపతుల సౌజన్యంతో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలగ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు పాయక రామారావు, సభ్యులు పిట్టా నారాయణరావు, గంట శ్రీను, పసుపురెడ్డి లక్ష్మికుమారి, వెంకట నరసింహమూర్తి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : మట్టి వినాయక ప్రతిమలతో సభ్యులు

యథేచ్ఛగా పశువుల సంచారం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కెటి రోడ్డుపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పలాస జీడి పిక్క బొమ్మ, ఇందిరా గాంధీ జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్, కాశిబుగ్గ రాజీవ్ గాంధీ జంక్షన్ తదితర ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో పదుల సంఖ్యలో పశువులు రోడ్లపై కూర్చోడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నా అధికారులు ఎందుకుపట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేపదే రోడ్లపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయని, పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు



సంచరిస్తున్న పశువులు

అడ్డంగా, దుకాణాలకు ఎదురుగా పశువులు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వ్యాపారాలు చేయలేక పోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ చూపి రోడ్డుపై పశువులు సంచరించ కుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నాయుడు చెరువు పరిశీలన

కొత్తూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిలో ఉన్న సర్వే నంబరు 270 నాయుడు చెరువును తహశీల్దార్ కె.బాలకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ చెరువు ఆక్రమణదారులు ఆక్రమించి భవనాలను నిర్మించారు. దీనిపై ఏడాది క్రితం అదే రహదారిలోని సుంకరి కోటేశ్వరరావు ప్రజా ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై మండల లెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఫిర్యాదారుడు ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దార్ పరిశీలించి సమగ్ర సర్వే నివేదిక అంద జేయాలని సర్వేయర్ రెడ్డి గవరయ్యకు ఆదేశించారు. ఈయన వెంట విఆర్ఒ సింహాచలం ఉన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

శ్రీకాకుళం: శారీరక, మానసిక ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.వి రవిశంకర్, గజెల్స్ వాసుదేవ్, ఎస్.జోగినాయుడు అన్నారు. ఆదివారం జిల్లాస్థాయి ఘట్కా కాంపిటేషన్ పోటీలు నగరంలో పిఎస్ఎన్ స్కూల్‌లో నిర్వహించారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆర్గనైజ్డ్ డిస్ట్రిక్ట్ ఘట్కా శ్రీకాకుళం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 19, 20, 21న పంజాబ్ యూనివర్సిటీ, చండీఘర్, పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారు. ఘట్కా క్రీడవల్ల శ్వాసక్రియతో పాటు జీర్ణ వ్యవస్థకు మెరుగుకు అవకాశం ఉంటుంది. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. టిడిపి నాయకులు డాక్టర్ బలగ శివప్రసాద్, జిల్లా ఘట్కా అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఖగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వి.శ్యామ సుందరరావు, సెక్రటరీ బి.హర్ష వర్ధన్, జాయింట్ సెక్రటరీ బి.వెంకటరమణ మూర్తి, కోశాధికారి సురేష్, కోచ్ కె.సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ట్రాక్టర్



కారును ఢీకొన్న ట్రాక్టర్

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో జిసి హోం వద్ద ఆదివారం కారును ట్రాక్టర్ ఢీకొట్టింది. పోలాకి నుంచి వస్తున్న కారును నరసన్నపేట నుంచి పోలాకి వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారులోని ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



పశువులను తరలిస్తున్న వాహనం

ప్రజాశక్తి- కవిటి

ఒడిశా నుంచి అక్రమ ంగా తరలిస్తున్న 16 పశువులను పోలీసులు ఆదివా రం పట్టుకున్నారు. మండలంలోని కరాపాడు టోల్ వద్ద వాహన తనిఖీల సమయంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రవివర్మ అందించిన సమాచారం మేరకు కంచిలి మండలానికి చెందిన గొనప వాసులు అనే వ్యక్తి ఒడిశా ప్రాంతం నుంచి పశువులను కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని అలమండ సంతకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ పశువులను ఐచర్ వ్యాన్‌లో కుక్కి తెస్తుండగా కరాపాడు టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన 16 పశువులను కొత్తవలసలోని హెల్పింగ్ హేండ్స్ సంస్థకు అప్పగించారు. ఈ వ్యవహారంలో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలో అల్లినగరంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.75, 600 నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నమన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లావేరు: మండల కేంద్రం లావేరు పంచాయతీ పరిధిలోని జిజి వలసలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేసి ఎనిమిది మందిని పట్టుకుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15 వేల 310 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఆర్‌డిఒ దంపతులు

ఆర్‌డిఒ దంపతుల రక్తదానం

ప్రజాశక్తి- పలాస

రక్తదానం చేయడం ద్వారా మరో ప్రాణాన్ని కాపాడవచ్చని ఆర్‌డిఒ జి.వెంకటేష్ అన్నారు. కాశీబుగ్గ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస పాలబుగ్గ, కాశీబుగ్గ ప్రాణదాత బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా ఆర్‌డిఒ, ఆయన సతీమణి రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరు నెలలకొకసారి రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా శరీరంలో కొత్త రక్తం తయారువుతుందని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఒకరు ఇచ్చే రక్తం నుంచి ఆరు రకాలుగా ఉపయోగించుకోవచ్చు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస పాలబుగ్గ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం రక్తదాన శిబిరంలో 65 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మల్లా మనిల్, బోయిన తరుణ్, బోయిన విజయ్, కిల్లంశెట్టి రాజేంద్ర, కొంచాడ రామకృష్ణ, తూముల శ్రీనివాసరావు, కోట్ని దుర్గాప్రసాద్, పెంట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సిక్కోలు చేయూత సేవా సంఘం 8వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం పట్టణంలోని లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. న్యూబ్లడ్ బ్యాంక్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని పురపాలక సంఘ కమిషనర్ తమ్మినేని రవి ప్రారంభించారు. శిబిరంలో సుమారు 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.వి.రమణమ్మ, సిక్కోలు చేయూత సేవా సంఘం అధ్యక్షులు గోపీకృష్ణ, కార్యదర్శి వీటి నాయుడు, గౌరవాధ్యక్షులు గుడ్ల బాబు, గౌరవ సలహాదారు ఎస్.వి. రమణ, సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తలగాన హేమారావు అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపేటలో పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థుల ఇళ్లను ఆదివారం సందర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలకు రాకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి తల్లితండ్రులకు మార్గదర్శనం చేశారు. కొత్త జాతీయ విద్యా చట్టం ప్రకారం బడిఈడు పిల్లలు అందరూ చదవాన్నారు. ఏ ఒక్కరూ పాఠశాల బయట ఉండకూడదని పేర్కొన్నారు. 2030 నాటికి శత శాతం అక్షరాస్యత సాధించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యాల శ్రీనివాసరావు, ఎస్ఎంసి చైర్మన్ బమ్మిడి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.